సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 29 । నవంబర్ । 2023



సెక్టోరల్ అధికారులే కీలకం

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. -8లో



ఎర్రచందనం స్వాధీనం

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.360
రెండోరకం	రూ.160	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 296 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నిధుల మంజూరుపై హర్షం

చిట్వేలి: చిట్వేలి–రైల్వేకోడూరు రోడ్డు అభివృద్ధి (డబుల్ రోడ్డు) పనులకు రూ. 35.30 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ లింగం గంగాదేవి తెలియజేశారు. మంగళవారం ఆమె చిట్వేలిలో విలేకరులతో మాట్లాడుతూ మండల ప్రజల చిరకాల కోరిక జగనన్న ప్రభుత్వంలో తీరుతుండడం ఆనందంగా ఉందన్నారు. అలాగే తాను డైరెక్టర్‌గా ఉన్న సమయంలో రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు కావడం సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, కృషిచేసిన చెవ్వు శ్రీనివాసుల రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: కార్తీకమాసం సందర్భంగా కడప డిపో నుంచి డిసెంబర్ 4న సోమవారం అరుణాచలానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. ముందస్తుగా రిజర్వేషన్ చేసుకొనే వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ ఎస్ఆర్‌టీసీ ఆన్‌లైన్.ఇన్ తిరుమణ్ణామలై సరీ్వసు నెంబరు 6001, 6002 ద్వారా సీట్లు రిజర్వు చేసుకోవచ్చన్నారు.అలాగే కడప ఆర్టీసీ బస్టాండులో రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ పొందవచ్చన్నారు. పెద్దలకు రూ.1050, పిల్లలకు రూ.570గా చార్జీ నిర్ణయించామన్నారు. ఈ సర్వీసులు ఉదయం 5 గంటలకు, 5.30 గంటలకు బయలుదేరుతాయన్నారు. భక్తులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు గండిలో టెండర్లు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధికి సంబంధించి ఖాజీపేట, చక్రాయపేట మండలాల్లో ఉన్న భూమిని కౌలుకు ఇచ్చేందుకు, స్వామి వారి అలంకరణ నిమిత్తం పూల సరఫరాకు సంబంధించి ఈనెల 30న షీల్డ్ టెండర్, బహిరంగవేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. ఖాజీపేట మండలంలో ఉన్న 1.55 ఎకరాలు, చక్రాయపేట మండలంలోని 0.10 సెంట్ల భూమిని 3సంవత్సరాల కాల వ్యవధితో ఇవ్వనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు రు.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.అలాగే సంవత్సర కాలం పాటు స్వామి వారి అలంకరణకు పూలు సరఫరా చేయడానికి ఆసక్తి కలవారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని చెప్పారు.షాపింగ్ కాంప్లెక్‌లో ఖాళీ గదులను అద్దెకు పొందాలనుకునే వారు 30 వేలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

2న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 2న శనివారం ఉదయం 9.00 గంటలకు అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, పీజీ, బీఎస్సీ నర్సింగ్, డిప్లొమా, బి.ఫార్మసీచేసి హెవీ లైసెన్స్ కలిగి 18–35 వయస్సుగల వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ. 13–25 వేల వరకు హోదాన్ని బట్టి వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు విద్యార్హతల ధృవపత్రాలతో వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎం. దివ్య



చిన్నికృష్ణ

కడప స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–17 రాష్ట్రస్థాయి పోటీల్లో వైఎస్ఆర్ జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించిన ఎం. దివ్య, ఎస్. చిన్నికృష్ణలు చక్కగా రాణించి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్లకు ఎంపికయ్యారు. అదే విధంగా ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి పోటీల్లో సి. సంకీర్తన, కె. లోకేష్‌లు ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరంతా డిసెంబర్‌లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు రామనపల్లె జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కె. రెడ్డయ్య తెలిపారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరి అభినందించారు.

ప్రగతి వైపు పరుగులు

- రాష్ట్రంలో 16 సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన, 12 సబ్‌స్టేషన్లు వర్చువల్ ద్వారా ప్రారంభించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి
- గాలివీడులో 132/33కేవీ విద్యుత్ ఉప కేంద్రం ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా, జేసీ ఫర్హాన్ అహ్మద్ ఖాన్



గాలివీడులో మెగా సోలార్ పార్క్ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, తదితరులు

గాలివీడు: అన్నమయ్య జిల్లా అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. తాజాగా జిల్లాలో సబ్ స్టేషన్, సోలార్ ప్లాంట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం.. బుధవారం వాల్మీకిపురంలో ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించనున్నారు. వెరసి వ్యవసాయంతో పాటు పరిశ్రమలకూ మంచి రోజులు వస్తున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

రైతులకు 9 గంటల విద్యుత్ పగటి పూటే ఇవ్వాలని అధికారంలోకి రాగానే నిర్ణయించామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి నాణ్యమైన విద్యుత్ అందివ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆ దిశగా అడుగులు వేస్తూ మంగళవారం ప్రారంభించిన సబ్‌స్టేషన్లు స్థానికులకే అంకితం చేస్తున్నామన్నారు.ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో 16 సబ్‌స్టేషన్లు శంకుస్థాపనలు, 12 సబ్‌స్టేషన్లను ప్రారంభోత్సవాలను చేశారు. ఇందులో భాగంగా రాయచోటి నియోజక వర్గంలోని గాలివీడు వద్ద 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభం, తూముకుంట వద్ద 100 మెగా వాట్లు సామర్థ్యం గల సోలార్ ప్లాంటుకు భూమి పూజను సీఎం జగన్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

- గాలివీడులో రూ28.44 కోట్లతో నిర్మించిన 132/33 కేవి సబ్‌స్టేషన్ ప్రారంభం, తూముకుంట వద్ద 100 మెగా వాట్లు సోలార్ ప్లాంటు నిర్మాణంలో భూమి పూజా కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్ ఖాన్ పాల్గొని మాట్లాడుతూ గాలివీడులో 132/33 కేవి విద్యుత్ ఉప కేంద్రాన్ని రూ28.44 కోట్ల నిధులతో 5.03 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారని, దీని సామర్థ్యం 31.5 ఎం.వి.ఏ అని, ఈ ఉప కేంద్రం రెండు 132 కేవి ఫీడర్ల ద్వారా 220 కేవీ చక్రాయపేట ఉపకేంద్రానికి అనుసంధానం చేయబడిందన్నారు. గాలివీడు సబ్‌స్టేషన్ ద్వారా గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలలోని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని, 43వేల మంది వినియోగదారులు లబ్ధి పొందుతారన్నారు. తూముకుంట వద్ద ఏర్పాటు చేస్తున్న 100 మెగా వాట్లు సామర్థ్యంగాల సోలార్ ప్లాంట్ వల్ల తక్కువ ఖర్చుతో ఏడాదికి 200 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి సోలార్ ప్లాంటు నుంచి భారీ స్థాయిలో నిధులు మంజూరు చేస్తారన్నారు.

హర్షం... గాలివీడులో 132/33 కేవి సామర్థ్యంగల ఉప కేంద్రాన్ని ప్రారంభించడంపై మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలను తెలియజేశారు.

నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంతో పాటు అన్ని మండలాలను అభివృద్ధిలో నడిపించడం తన ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, మండల కన్వీనర్ యదుభూషణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఖాదర్‌మోదీన్(ఎస్‌కే), సింగల్ విండో అధ్యక్షులు వేదమూర్తిరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈలు కృష్ణమనాయుడు, విశ్వేశ్వరరెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, సోలార్‌డీఈ శివశంకర్‌నాయుడు, ఏఈ నరేంద్రనాధ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్లు ఉమాపతిరెడ్డి, కేశవరెడ్డి, దీప్తి, ఉమా ప్రబాకర్, ఎంపీటీసీలు చిన్నరెడ్డి, చంద్రప్రకాష్ రెడ్డి, షానవాజ్, నాయకులు గుమ్మా అమర్‌నాధరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, వెంకటాద్రి పాల్గొన్నారు.

రేపు కడపకు సీఎం వైఎస్ జగన్



కడప సెవెన్‌రోడ్స్: పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం కడప నగరానికి వస్తున్నారు. నంద్యాల జిల్లా అవుకు మండలం మెట్టుపల్లె హెలిప్యాడ్ నుంచి మధ్యాహ్నం 1.00 గంటకు బయలుదేరి 1.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 1.40 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.55 గంటలకు అమీన్‌పీర్ దర్గా చేరుకుంటారు. 2.00 నుంచి 2.30 గంటల వరకు దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తారు. 2.30 గంటలకు దర్గా నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 2.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 2.55 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 3.35 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

కడప అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 30న కడప పర్యటన నేపథ్యంలో పెద్ద దర్గా, విమానాశ్రయంవద్ద జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజుతో కలిసి చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పరిశీలించారు.పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ యు. వెంకటకుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది వున్నారు.



పెద్దదర్గాలో భద్రతా ఏర్పాట్లను కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎస్పీ

పరిశ్రమలకు మంచి రోజులు

- ఇప్పటికే అనేకచోట్ల పారిశ్రామిక పార్కులు
- నేడు వాల్మీకిపురం మండలం తోటగుంటపల్లి వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కుకు సీఎంతో వర్చువల్ విధానంలో శంకుస్థాపన

సాక్షి రాయచోటి : అన్నమయ్య జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎక్కడికక్కడ పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు సృష్టించడం ఒక ఎత్తయితే...అందుకు సంబంధించి పరిశ్రమలు నెలకొల్పేందుకు అవసరమైన వసతులను కల్పించడం మరో ఎత్తు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూనే ఇంకోవైపు పరిశ్రమలకు సంబంధించి రాయితీలను అందిస్తోంది. ఈ తరుణంలోనే నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పరిశ్రమలు ఏర్పాటుచేసే వారికి ఒకేచోట ఏపీఐఐసీ ఎస్టేట్‌కు శ్రీకారం చుడుతున్నారు. అన్నమయ్య జిల్లాలోని వాల్మీకిపురం మండలం తోటగుంటపల్లె వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కుకు బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు.

రూ. 15.93 కోట్లతో సౌకర్యాల కల్పన

జిల్లాలోని వాల్మీకిపురం మండలం తోటగుంటపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న ఎంఎస్‌ఎంఈ పార్కుకు సంబంధించి అన్ని వసతులు కల్పించనున్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి సంబంధించి అక్కడ రోడ్లు, తాగునీరు, మురుగునీరు, విద్యుత్ ఇతర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ. 15.93 కోట్లను కేటాయించింది. సుమారు 89.72 ఎకరాల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నారు.

నేడు వర్చువల్ విధానంలో పార్కుకు శంకుస్థాపన

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం వర్చువల్ విధానంలో జిల్లాలోని తోటగుంటపల్లె వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కుకు శ్రీకారం చుట్టడంతోపాటు రూ. 15.93 కోట్ల పనులకు వర్చువల్ విధానంలో శంఖుస్థాపన చేయనున్నారు. అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అన్ని పనులను పూర్తి చేసుకుని బుధవారం శంకుస్థాపనకు పార్కు సిద్ధమైంది.

బడుగు వర్గాల ఆశాజ్యోతి పూలే

జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే



జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే,మున్సిపల్,మార్కెట్ కమిటీ చైర్మన్‌లు

రాయచోటి అర్బన్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక అసమానతలను ఛేదించిన కాంతిరేఖ మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ గిరీషా పిఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని మాసాపేట బ్రిడ్జివద్దగల జ్యోతిరావుపూలే విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా, మార్కెట్‌కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు,కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే పూలమలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యమకర్త, సంఘసేవకుడు, సామాజిక తత్వవేత్త, మహిళా అభ్యుదయవాది, నిరంతరం మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన జ్యోతిరావుపూలేను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీనజన బాంధవుడు అన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా జగన్ ప్రభుత్వం బడుగు,బలహీనవర్గాల సంక్షేమానికి కృషిచేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, వైఎస్ఆర్ సిపి నేతలు విజయభాస్కర్, బుజ్జిబాబుతో పాటు పలువురు కౌన్సిలర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉరుసు ఉత్సవం



పెద్దదర్గాలో నిర్వహించిన ముషాయిరాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, పీఠాధిపతి



ముషాయిరాకు హాజరైన భక్తులు

కడప కల్చరల్: రాష్ట్రంలోనే పెద్ద ఉత్సవంగానే పేరుగాంచిన కడప పెద్దదర్గా ఉరుసులో భాగంగా నాలుగో రోజు మంగళవారం కూడా వైభవం కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ భక్తుల సమస్యలను తెలుసుకుని పరిష్కారాలు సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి ఉరుసుకు హాజరైన ఫకీర్ల కార్యకలాపాలు, నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. హాజరైన చౌదరీలు, ఖలీఫాలతో సమావేశమై ఉరుసులో సేవలు అందించినందుకు వారిని అభినందిస్తూ విశేష వస్త్రాలను అందజేశారు.ఉరుసు ఉత్సవాల్లో ముషాయిరాకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా హాజరయ్యారు.

- ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతి తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తహలీల్ ఫాతెహా అనంతరం కిష్టిలూటీ (మహా నైవేద్యం) కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు పోటీలు పడ్డారు. సాయంత్రం మలంగ్‌షాను దీక్ష విరమింపజేశారు. రాత్రి ముషాయిరా హాలులో పీఠాధిపతి ఆధ్వర్యంలో అఖిల భారత 79వ జాతీయ ముషాయిరా నిర్వహించారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన గొప్ప కవులు ఇందులో పాల్గొని గురువులను స్మరించకుంటూ కవితలను వినిపించారు. పెద్ద దర్గా ఉరుసుకు అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మంగళవారం విచ్చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కడప గడపలో గండికోట ప్రాభవం

- ఏడురోడ్ల కూడలిలో గండికోట నమూనా
- పర్యాటక రంగానికి మరింత చేయూత
- భావితరాలకు చరిత్ర తెలిపే కృషి



కడప నగరం ఏడురోడ్ల కూడలిలో ఏర్పాటు చేయనున్న గండికోట నమూనా

కడప సిటీ/కల్చరల్ : కడప గడపలో ఇండియన్ గ్రాండ్ క్యానియన్‌గా ప్రాచుర్యం పొందిన గండికోట ప్రాభవం ఆవిష్కృతం కానుంది. దాదాపు వెయ్యేళ్ల నాటి కల్యాణి చాళుక్యుల పాలకుడు చిద్దన చోళ మహారాజు (కాకరాజు) నిర్మించిన ఈ కోటకు గొప్ప పర్యాటక ప్రాంతంగా ఇప్పటికే పేరుంది. ఇంతటి గొప్ప ప్రాముఖ్యతగల దీనికి మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ఇటీవల ఒబెరాయ్ లాంటి అంతర్జాతీయ హోటళ్లను నిర్మించేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వాసులకు గర్వకారణమైన ఈ కోట నమూనాను కడప నగర వాసులు నిత్యం దర్శించుకునే అవకాశం కలుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉన్న ఏడురోడ్ల కూడలిలో ఈ దుర్గం నమూనాను ఏర్పాటు చేస్తున్నారు. కడపలోని కూడళ్ల సుందరీకరణలో భాగంగా ఏడురోడ్లలో విశాలమైన కూడలిని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆ కూడలిని చూడగానే నిలువెత్తు దర్పంతో నాటి రాచఠీవి ఉట్టిపడేలా గండికోట నమూనా కనిపించేలా నిర్మాణం సాగుతోంది. పర్యాటక రంగం మరింత పుంజుకునేందుకు భావితరాలకు గండికోట నమూనాతో ఆ చరిత్ర దూరం కాకుండా చేసే ప్రయత్నాల్లో ఈ నిర్మాణం జరుగుతోంది. గతంలో ఈ కూడలిలో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహాన్ని కూడా మరింత శోభతో ఇక్కడే ఏర్పాటు చేయనున్నారు. మిగతా కూడళ్లలో కూడా అంతకుముందు ఉన్న విగ్రహాలను మరింత మెరుగు పరిచి నగర వాసుల ఆహ్లాదం కోసం సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

కూడళ్ల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ

కడపలోని కూడళ్ల సుందరీకరణపై జిల్లా ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. అందులో భాగంగానే నగరంలోని దాదాపు అన్ని కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విగ్రహాలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. 2019 నుంచి కడపలోని కూడళ్ల ఆధునీకరణ విషయంపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు ప్రత్యేక కసరత్తు చేపట్టి నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగానే ఏడురోడ్ల కూడలిలో గండికోట నమూనా ఏర్పాటు చేసి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

కరువు రైతులను ఆదుకుంటాం

ఆర్‌జేడీ చంద్రనాయక్



గోపగుడిపల్లె గ్రామ సచివాయంలో కరువుపై రైతులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ చంద్రనాయక్

రామాపురం: ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక పంటలు పూర్తిగా ఎండిపోయి నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని గోపగుడిపల్లె గ్రామ సచివాయంలో రైతులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాలలో ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏయే పంటలు సాగు చేశారని రైతులను అడగ్గా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ , వరి, కంది పంటలు సాగు చేశామని, సమయానికి వర్షాలు పడకపోవడంతో బావుల్లో, బోరుల్లో, చెరువులలో నీరు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు తాగునీరు, పశువులకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామాల్లోని బోరు బావులలో కూడా ఒకటి రెండు మాత్రమే అంతంత మాత్రమే నీరు ఉందని తెలియజేశారు. ఈ విషయంపై జేడీఏ స్పందిస్తూ ఈ ఏడాది మండలం కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిందని, త్వరలో కేంద్ర కరువు బృందం గ్రామాల్లో పర్యటిస్తారని, గ్రామాలలో రానున్న కరువు బృందానికి రైతులు తెలియజేయాలని, పంటలపైన కరువు బృందం తాగునీరు, పశుగ్రాసం, ఎండిపోయిన పంటలపై తదితర విషయాలపై రైతులను అడిగి తెలుసుకొని ఉన్నతాధికారుల దృష్టికి కెళ్తారన్నారు. మండల వ్యాప్తంగా వరి 390 ఎకరాలు, వేరుశనగ 1,439 ఎకరాలు, కంది 20 ఎకరాల్లో పంటలు సాగు చేశారని తెలిపారు. పశువుల మేత కోసం ఇబ్బందింగా ఉందని పశుగ్రాసం మంజూరు చేయాలని ఆయన తెలియజేశారు. సమావేశంలో ఏడీఏ జయరాణి, ఎంపీఈఓలు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



పంటలను పరిశీలిస్తున్న వివిధ దేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక లాభం పొందవచ్చునని రైతు సాధికార సంస్థ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ద్వైవార్షిక విరామం, ప్రతిబింబంలో భాగంగా మంగళవారం లావోస్, పీడీఆర్, భారత్, కెన్యా, జింబాబ్వే, సెనెగల్, బుర్కినాఫావో, ట్యునీషియా, పెరూ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు మండలంలోని అయ్యవారిపల్లిలో సేంద్రియ పంటల సాగును పరిశీలించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా, సమర్ధవంతంగా ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలనలో భాగంగా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తల బృందంకు వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సిరాడ్, వరల్డ్ ఫిష్, ఆలయన్స్, బైయోడైవర్శిటీ, ఒఈపి, ఇనేరా సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో రైతు సాధికార సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం పేరుతో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు ప్రపంచ దృష్టికి ఆకర్షిస్తున్న నేపథ్యంలో గ్లోబల్ స్థాయి గుర్తింపు పొందిందన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన ఏటీఎం, డిఆర్‌పిఎం, ఏ గ్రేడ్, పెరటి తోట మోడల్స్‌ను, ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. టీం లీడర్ ధర్మేంద్ర, సందీప్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామక్రిష్ణమరాజు, ఆర్‌బీకే ఇన్‌ఛార్జ్ యశోదమ్మ, ఎల్2 స్వాతి, రైతులు పాల్గొన్నారు.

గర్భిణి ఆత్మహత్య

గాలివీడు :మండల పరిధిలోని తూముకుంట గ్రామం ఎగువమూలకు చెందిన శివమ్మ(20) అనే గర్భిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు రఘుపతినాయుడు గత ఏడాది శివమ్మను పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. వీరు అన్యోన్యంగా జీవిస్తున్న నేపథ్యంలో శివమ్మ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలు ఐదు నెలల గర్భిణి. ఈమె మృతిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సమాచారం.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన సంఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. నక్కలదిన్నెకు చెందిన ఎస్.ఖజాబ్ (39) బెంగళూరు బస్టాండు నుంచి ద్విచక్రవాహనంలో నక్కలదిన్నెకు వెళుతుండగా పోస్టాఫీసు సమీపంలో ఆటో ఢీకొంది. కిందపడి తీవ్రంగా గాయపడటంతో గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బస్ షెల్టర్‌ను ఢీకొన్న సిమెంటు ట్యాంకర్


బస్ షెల్టర్‌లోకి దూసుకెళ్లిన సిమెంటు ట్యాంకర్

గుర్రంకొండ : బస్ షెల్టర్‌ను సిమెంటు ట్యాంకర్ ఢీకొనడంతో బస్‌షెల్టర్ ధ్వంసం కాగా డ్రైవర్‌కు గాయలైన సంఘటన మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దిగువతొట్లివారిపల్లె వద్ద జరిగింది. మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి సిమెంటు ట్యాంకర్ లారీ ఎర్రగుంట్లకు బయలుదేరింది. మార్గమధ్యంలో దిగువతొట్లివారిపల్లె వద్ద వేగంగా వస్తూ అదుపుతప్పి రోడ్డుపక్కనున్న బస్‌షెల్టర్‌ను ఢీకొంది. ఈ సంఘటలో డ్రైవర్ రాజేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనలో ప్రయాణికులకు నీడనిచ్చే బస్‌షెల్టర్ పూర్తిగా ధ్వంసమైంది. జరిగిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణలో

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్


శిక్షణా కార్యక్రమానికి హాజరైన అధికారులు, సిబ్బంది (ఇన్‌సెట్) శిక్షణా కార్యక్రమాల్లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, పక్కన ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి వచ్చే సాధారణ ఎన్నికల నిర్వహణపై సెక్టోరల్ ఆఫీసర్లు, పోలీస్ సెక్టార్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సెక్టార్ అధికారులు సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. పోలింగ్ పూర్తయి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ వరకు తీసుకొచ్చే పూర్తి బాధ్యత మీరే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం సెక్టోరల్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పోలింగ్ కేంద్రాల మౌలిక సదుపాయాలపై నివేదికను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు.

స్వేచ్ఛాయుతంగా ఓటు వేసుకోవాలి

ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు స్వేచ్ఛా వాతావరణం కల్పించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేటట్లు చూడాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. రూట్ మ్యాపు, సెక్టార్ మ్యాపు సంబంధిత తహసీల్దార్‌తో సంప్రదించి తయారు చేసుకోవాలన్నారు.

1607 పోలింగ్ కేంద్రాలు

అన్నమయ్య జిల్లాలో 1607 పోలింగ్ కేంద్రాలు, 620 మంది సెక్టోరల్ అధికారులు పనిచేస్తారన్నారు. వీరందరూ తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

పటిష్టమైన బందోబస్తు :
– జిల్లా ఎస్పీ కృష్ణారావు:

పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహిస్తామని ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. పోలీస్ సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు పక్కాగా ఉండేటట్లు చూడాలన్నారు. ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు రేషన్‌కార్డు, ఓటర్ కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు, ఎంప్లాయ్ ఐడీ కార్డు, ఏదైనా ఒకటి గుర్తింపుకార్డుతో వచ్చి ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించండి

ఓటర్లపై అధికంగా ప్రభావం చూపే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు గతంలో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సంఘటనలు, బైండోవర్ వివరాలను గుర్తించి ఈసారి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎస్పీ కింది స్థాయి అధికారులకు సూచించారు.

నవశకం

జగనన్న సురక్షతో మేలు జరిగింది



నేను, నా భర్త కూలి పనులు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. గత టీడీపీ పాలనలో పక్కా గృహం మంజూరైంది. అష్ట కష్టాలు పడి ఇంటి పైకప్పు వరకు ఇంటి నిర్మాణం చేపట్టాం. అయితే ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదు. అప్పటి నుంచి అసంపూర్తిగా ఉన్న ఇంట్లో దుర్భరంగా కాలం వెళ్లదీసే వాళ్లం. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి మా సమస్యల గురించి అడిగారు. సంబంధిత హౌసింగ్ అధికారులకు మా గోడును వివరించారు. అనంతరం మాకు ఇంటి బిల్లులన్నీ మంజూరు కావడంతో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని అదే ఇంట్లో హాయిగా కాలం వెళ్లదీస్తున్నాం. మాకు చాలా ఆనందంగా ఉంది.

– కొమ్ము స్వప్న, పెద్దతిప్పసముద్రం

ప్రభుత్వ పాఠశాలలకు నాడు-నేడు ఒక బృహత్తర పథకం



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత నాడు-నేడు అనే బృహత్తర పథకంతో ప్రభుత్వ పాఠశాల స్థితి గతులు మార్చేశారు. ముఖ్యంగా విద్యార్థులకు మరుగుదొడ్లు, సురక్షిత మంచి నీరు వంటి మౌలిక సదుపాయాలతో పాటు, మధ్యాహ్న భోజన పథకంలో రోజుకు ఒక మెనూ ఇస్తున్నారు., ప్రతి రోజు గుడ్డు, చిక్కి, రాగి జావ ఇలాంటివి చూస్తే విద్యార్థులపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమ ఎలాంటిదో తేటతెల్లమవుతోంది.

– లెక్కల జమాల్‌రెడ్డి, ఒంటిమిట్ట జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు

సొంత ఇంటి కల నెరవేరింది



మాకు సొంత ఇల్లు లేక బాడుగ ఇంట్లో ఉంటూ జీవనం గడిపేవాళ్లం. పిల్లలను చదివించుకుంటూ బాడుగలు కట్టాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. స్థలం కొనే ఆర్థిక స్థోమత లేక అలాగే ఉండిపోయాం. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చాక మాకు మాధవరం-1 జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేశారు. అక్కడ ఇల్లు కట్టుకున్నాము. సొంత ఇల్లు లేదనే దిగులు పోయింది. చాలా సంతోషంగా ఉన్నాము.

– చింతా సరోజ, జగనన్న కాలనీ, మాధవరం-1 పంచాయతీ, సిద్దవటం మండలం

లింగ వివక్షపై అవగాహన అవసరం


సుండుపల్లెలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సుండుపల్లె(రాజంపేట) : సమాజంలో లింగ వివక్షపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సుండుపల్లెలో మంగళవారం లింగ ఆధారిత హింసపై జాతీయస్థాయి అవగాహన ప్రచార ఉద్యమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలు, లింగవివక్ష, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. అలాగే మహిళలను విద్యావంతులు చేయడం, బాల్యవివాహాలను నిరోధించడం, మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పోషణ విషయం గురించి తెలియచేయడం ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, మండల నాయకులు, జేసీఎస్ కన్వీనర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే ఇల్లు కూల్చివేతకు యత్నం!

- నిందితులను పట్టుకున్న స్థానికులు
- పోలీసులకు అప్పగింత
- అన్నదమ్ముల మధ్య ఆస్తి గొడవ కారణం


కూల్చివేతకు గురైన గది ఇదే

రాజంపేట : రాజంపేట-నెల్లూరు రహదారిలోని పోలి గ్రామంలో సీతారామాలయం ఎదురుగా ఉన్న ఇంటిని కడప నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు సోమవారం రాత్రి కూల్చివేసే ప్రయత్నం చేశారు. వివరాలిలా.. గొట్టం వెంకటరమణ అనే వ్యక్తి కడప నుంచి రెండు బైకులలో కొంతమందిని తీసుకొచ్చి తన తమ్ముడు శ్రీనివాసులు నిర్మించుకున్న ఇంటిని కూల్చేందుకు ప్రయత్నించాడు. శబ్దం వస్తున్న తరుణంలో ఆలయంలో నిద్రిస్తున్న అయ్యప్పస్వాములు అప్రమత్తమయ్యారు. వెంటనే గొట్టం శ్రీనివాసులుకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు, స్థానికులు ఇంటి వద్దకు వెళ్లి చూడగా ఇంటిని కూలడానికి వచ్చిన వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. అయితే శ్రీనివాసులుతోపాటు స్థానికులు వారిని వెంబడించారు. ముగ్గురిని పట్టుకున్నారు. బైకులను స్వాధీనం చేసుకున్నారు. మన్నూరు పోలీసులకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా బాధితురాలు డ్వాక్రా యానిమేటర్ సుబ్బనరసమ్మ విలేకరులతో మాట్లాడుతూ 1960 సంవత్సరంలో తన భర్త శ్రీనివాసులుకు, వారి తండ్రి 1.50 సెంటు స్థలం ఇచ్చాడన్నారు. 2000 సంవత్సరం నుంచి అక్కడే నివాసం ఉంటున్నామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సర్వే కూడా చేసి స్థలం తమదేనని వెల్లడించారన్నారు. అయితే రెండేళ్ల నుంచి ఈ ఇంటిని ఖాళీ చేయాలని గొట్టం వెంకటరమణ వేధిస్తున్నాడన్నారు. రాత్రి 11 గంటలకు కొంతమంది రౌడీమూకలను తీసుకొచ్చి తమ గదిని పగులకొట్టారన్నారు. పోలీసులు ఈ విషయంపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

చిన్నకమ్మపల్లె యువకుడు

అమెరికాలో ఆత్మహత్య


హేమంత్ మృతదేహం

కేవీపల్లె : మండలంలోని తిమ్మాపురం పంచాయతీ చిన్నకమ్మపల్లెకు చెందిన చిన్నయ్య కుమారుడు హేమంత్ (24) అమెరికాలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హేమంత్ ఎంఎస్ చదవడానికి ఏడాది క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడ మిస్సౌరి యూనివర్సిటీలో విద్యనభ్యసించేవాడు. అక్కడ ఏమి జరిగిందో తెలియదు కానీ ఈ నెల 15న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి

మదనపల్లె : ప్రమాదశాత్తు మిద్దెపై నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. ఇందిరానగర్‌కు చెందిన ఖాదర్‌బాషా కుమారుడు ఎస్.యూనస్(32) స్థానికంగా ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. అతనికి భార్య ఖదీరున్నీసాతో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు. యూనస్ సోమవారం రాత్రి సెకండ్‌షోకు వెళ్లి ఇంటికి వచ్చి మిద్దెపైన రెండవ అంతస్తులో నిద్రించాడు. ఉదయం 8 గంటలకు నిద్రలేచి కిందికి దిగి వస్తుండగా, అతనికి షుగర్ వ్యాధి ఉన్న కారణంగా కళ్లు తిరిగి ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో బాధితుడికి తీవ్రగాయాలు కాగా శరీరం రక్తసిక్తమైంది. వెంటనే కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిసింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బలిజపల్లి గ్రామానికి చెందిన పాత్తూరు నాగమునెయ్య (40) సోమవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీకే దిన్నె ఎస్ఐ బి. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన సమాచారం మేరకు నాగమునెయ్య మద్యానికి బానిసై డబ్బుల కోసం భార్యతో గొడవపడేవాడు. సోమవారం మధ్యాహ్నం మద్యానికి డబ్బులు కావాలని అతని భార్య సంపూర్ణను అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో వాదులాటకు దిగాడు. అదే రోజు అర్ధరాత్రి అతని కాలిపై మచ్చుకత్తితో నరికినట్లు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు అతని భార్య తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి భార్యను విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

నలుగురు నిందితులు అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు

ఒంటిమిట్ట : ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం నరవకాటిపల్లి గ్రామ పరిధిలో ఉన్న శేషాచలం రిజర్వు ఫారెస్టులో మంగళవారం కొంత మంది స్మగ్లర్లు ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని సమాచారం అందింది. దీంతో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు కడప ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ అధికారులు, లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు సిబ్బందితో దాడి నిర్వహించారు. పోలీసులను చూసి దుండగులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో నలుగురిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారయ్యారు. అక్కడ లభించిన 14 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక మోటర్ సైకిల్, మూడు సెల్‌ఫోన్లు, 1 గొడ్డలి స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం దుంగల బరువు 209 కిలోలు ఉంటుంది. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో ఓనం రామక్రిష్ణ, దుద్యాల పెంచలయ్య, షేక్ మహబూబ్‌బాషా, షేక్ వల్లీబాషా ఉన్నారు. వీరంతా నందలూరు మండలానికి చెందిన వారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ మధుసూదన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


జాతీయ రహదారిపై నిలబడిన వంగిమళ్ల బస్సు సర్వీసు

రామాపురం : అన్నమయ్య జిల్లా రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు మంగళవారం రాత్రి త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు రాయచోటి నుంచి బస్సు ప్రయాణికులతో వంగిమళ్లకు వెళ్తుండగా రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె సమీపంలోకి రాగానే బస్సు జాయింట్ వీల్ తెగిపోయింది. దీంతో బస్సును డ్రైవర్ జాతీయ రహదారి పక్కనే నిలిపివేశాడు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రహ'దారి'కి రైతు అభ్యంతరం

- రోడ్డు నిర్మాణానికి స్థలం వదిలేందుకు అంగీకరించని రైతు
- రోడ్డుకు ఇరువైపులా నిలబడి గ్రామస్తుల వినూత్న నిరసన
- అధికారుల హామీతో ఆందోళన విరమణ


శివరాంపురం మార్గంలో రోడ్డుకు ఇరువైపులా నిలబడి నిరసన తెల్పుతున్న గ్రామస్తులు

కురబలకోట : పది గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయుక్తమైన రోడ్డు నిర్మాణానికి స్థలం వదిలేందుకు ఓ రైతు అభ్యంతరం చెప్పడంపై గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. వివరాలు ఇలా.. కురబలకోట మండలంలోని కడప రోడ్డు నుంచి వనమరెడ్డిగారిపల్లె గ్రామం శివరాంపురం వరకు ఈఏపీ-3 గ్రాంట్ కింద రూ.5. 50 కోట్లతో 6.5 కిలోమీటర్లు తారు రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముదివేడు, మట్లివారిపల్లె, వనమరెడ్డిగారిపల్లె పంచాయతీ లోని పది పల్లెలకు ఎంతో సౌకర్యం. పొలాల వద్దకు, పల్లెలకు రాకపోకలకు అనుకూలం. మండలంలోనే ప్రాధాన్యత కల్గిన రోడ్డు. కొత్త రోడ్డుతో అందరూ ఆనందిస్తున్న సమయంలో మట్లివారిపల్లె రోడ్డు నుండి శివరాంపురం వెళ్లే మార్గం మొదట్లో ఓ రైతు రోడ్డుకు స్థలం వదిలేందుకు అభ్యంతరం చెప్పాడు. ఇతనిది 12 సెంట్లు మాత్రమే రోడ్డుకు పోతుంది. ఒక్క రైతు అభ్యంతరంతో రోడ్డు పనులకు తాత్కాలికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఆ ప్రాంత పరిసర పల్లెలకు చెందిన పలువురు రైతులు, గ్రామస్తులు మంగళవారం వివాదాస్పద స్థలం వద్ద రోడ్డుకు ఇరువైపులా నిలబడి గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. ఎందరికో ఉపయోగకరంగా ఉన్న ఈ రోడ్డు పనులను యథావిధిగా చేపట్టాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఎం.భీమేశ్వరరావు, ఎంపీపీ బి. దస్తగిరి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎస్‌వీ రమణారెడ్డి, సర్పంచ్ పెద్దగొని శ్రీనివాసులు తదితరులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఈ విషయమై విచారణ జరిపారు. వారి హామీ మేరకు గ్రామస్తులు నిరసన విరమించారు. సర్వేయర్ భువనేశ్వరి రోడ్డు స్థలాన్ని సర్వే నిర్వహించారు. ఆర్ఐ సుగుణ రైతుల నుండి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు తహసీల్దార్ ఎం. భీమేశ్వరరావు తెలిపారు. అయితే ఎంత మంది చర్చించినా రైతు ససేమిరా అనడంతో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

80 ఏళ్లుగా మట్టి రోడ్డు ఉంది

ముదివేడు దగ్గర కడప రోడ్డులో టోల్‌గేట్ ప్రాంతం నుండి దయ్యాలవారిపల్లె, శివరాంపురం ద్వారా తరిగొండ వరకు ఈ రోడ్డు ఉంది. 80 ఏళ్ల నుండి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు పది పల్లెలకు ఎంతో సౌకర్యం. మూగజీవాలకు మేలు. దగ్గరి దారి. పైగా తారు రోడ్డు వేస్తున్నారు. రవాణా సౌకర్యాల మెరుగుతో భూములకు విలువ పెరుగుతుంది. ఈ మార్గంలో పల్లెలకు మహర్దశ పట్టించే ఇలాంటి రోడ్డుకు ఒక్క రైతు అభ్యంతరం చెప్పడం భావ్యం కాదు

– శివరామప్ప నాయుడు, మాజీ సర్పంచ్, మట్లివారిపల్లె, కురబలకోట మండలం

ఈఏపీఎస్ఈ యాక్టు కింద చర్యలు

పది గ్రామాలకు ఉపయుక్తమైన తారు రోడ్డు పనులకు ఒక్క రైతు అభ్యంతరం చెబుతున్నారు. అయినా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పూర్వం నుంచి రోడ్డు ఉన్న కారణంగా ఈఏపీఎస్ఈ యాక్టు కింద రోడ్డు పనులు కొనసాగించడానికి చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. రైతు మరోసారి పెద్ద మనసుతో ఆలోచించాలి – ఎం. భీమేశ్వరరావు, తహసీల్దార్, కురబలకోట